కవితా కౌముది

# లొల్లాయి పాట బండారి రాజ్ కుమార్

1.

మనిద్దరం పక్కపక్కనే కూసోని నవ్వుకుంట,తుళ్లుకుంట మాట్లాడుకుని ఎన్ని యుగాలైంది? తుమ్మబంక అంటిచ్చిన జంటకమ్మలెక్క ఎన్నడూ విడిపోని అముడాల పిల్లల్లా కూడి వున్నోల్లమే గదరా! మనకేమయింది?

2.

హుద్ హుద్ తుఫాన్ లో కొట్టుకుపోయావనుకున్నాం.మళ్లీ ఇన్నాళ్లకు పెథాయ్ దయతో సలికి వణుక్కుంట వొచ్చినవని, నా గుడిసె ముంగట నెగడు దగడులో పీక్కుపోయిన నీ మొఖాన్ని నా చేతుల్లోకి తీసుకుని మురిసిపోతున్న.న్యాల సూపులతో మొఖం లేని తనమేదో కొట్టొచ్చినట్టు కనబడ్తనే వున్నది.

3.

మిత్రమా!ఎండిపోయినట్టుండే కొమ్మకు పూశిన మోదుగుపువ్వోలే సులుకు మొఖపోనివి. సూడసక్కని నీ మొఖం కలదప్పిందని కారణం అడగను.ఇన్నేళ్ల ఎడబాటునంతా వొంటరిగా ఎట్ల ఓర్సుకున్నవో నా షెవుల్లో జోరీగలా దూరి గుసగుసలాడైనా జెప్పు.కాశెంత నేనూ కుదుటపడుత.

4.

ఒకే చెట్టువేరుకు మొలిచిన పంగలకర్రలా ఎప్పటికీ ఎదురెదురుగనే వుందం.జేబులోని గులకరాళ్లతో లాగి లాగి తేనెతుట్టెను జోపుతున్నదెవలో, నెపం మనపై నెడుతున్నదెవలో ఆరా తీద్దం.మనిద్దరి నడ్మ జగల్ బంధీ గీతాల పెయిదెల్వని తనమే దప్ప జమాబంధీ లెక్కల ఊసెప్పుడూ లేదు.రంగులు పూసుకున్న మొఖాలతో మనమేనాటకమూ ఆడలేదు. ఒప్పుకుంటావు కదా!

5.

చేసే మూడు ముడికాల పనికి ముప్పూటలా తిండి దొరకదని బైరాగిలా తిరిగి తిరిగి నేర్సుకున్న బతుకు పాఠాలన్నీ కుప్పగా పోసి ఈ చల్లని సాయంత్రం పూట పిట్టగూళ్లు కట్టుకుందం. లొల్లాయి పాటలు పాడుకుంటూ పచ్చని పసిరికతనాల వొడిలో ఆటలాడుతూ ఒకే పాడెపై ఊరేగుదాం.

★★★

## కనిపించని పచ్చబొట్టు

### పావనీసుధాకర్

వొక్క క్షణపు తిరునాళ్ళ లో
తెలిసి తప్పి పోయిన మనసు
పెదవి మలుపులో
కరిగి పోయిన కాటన్ కాండీ రుచి!
వత్సరాల కోలాటాల్లో...
చిలికి...చిలికి.....చిమ్మిన జ్ఞాపకాల చెమ్మ!
ఎగిసి పొంగిన హృదయం నించి
ఎంత బరువునో మోసుకొస్తూ ......
వో ఒంటరి చినుకు!
తిరిగి రావద్దన్న తలపు
చర్మం క్రింద రక్తం లా...
రక్తం చిందని గాయంలా...
ఇది చెరిగి పోని ముద్ర !!

★★★



## సంవేదన

### రాజేష్ రెడ్డి

... ఎన్నినాళ్ళ పాటి సంవేదన ఇది!

చీకట్లో హృదయం కురుస్తున్నప్పటి నాటి మాట కదూ...
ఇప్పటికి పరుచుకుని వున్న ఈ మౌనం..!

నిశ్శబ్ద పత్ర వర్షాన్ని రాలుస్తున్న శిశిరపు పాటలో
విషాదాన్ని కళ్లు విన్నట్టు నిర్ధారించుకున్న నిరాశలన్నీ...
రాలుపూల రొదలూ...అపశ్రుతులే..!

కలలు కన్న ప్రతిసారీ కళ్లు పరితపించడం సాధారణమైనట్టు
విషాదం వేదనను వెదజల్లుతుంటే...
గొంతులో అంతరించిన కంపనలు గుండెలో మొనదేలి
ఉద్విగ్నతను మరిన్ని గాయాలతో బరువెక్కిస్తాయి..!-

జీవితముండడమంటే సుదీర్ఘ జ్ఞాపకాలుండడమేనన్నట్లు
నిదుర కళ్లకు నిశీథి రంగులంటుకుంటాయి...
మెలకువకు మరణమాసన్నమైనట్టుంది కానీ
రాత్రి పొలిమేర చేరలేని పగటి కలల ప్రాణం,
మన జ్ఞాపకాలను...మళ్లీ తిరగ తోడుకుంటానంటోంది..!

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ప్రేమ విహగమా! యుండుము వెడలవలదు
అరుగవలదీవు నా హృదయమును వీడి
వెడలి పొమ్మని యనుట తప్పిదము నిజము
ప్రేమ యెరుగని వ్యర్థజీవితము వలదు

జననమంది కనులు తెరచినది మొదలు
వయసు చెల్లి జరత్వమ్ము వచ్చు వరకు
అనుదినమ్మును నను నిలిపినది నీవె
జీవితమ్మునకర్థమిచ్చినది నీవె

నన్ను ప్రేమించు వారు లేకున్న యెడల
విలువ కోల్పోవు శేషజీవితము నాది
మాయమైనచో ప్రేమ నా మనసునందు
వ్యర్థము మనస్సు బ్రతుకు నిరర్థకమ్ము

కారుచున్నది కన్నీరు కాల్వ వోలె
దేనికొరకో మాత్రమెవరు తెలియలేరు
అన్నియును నాదు చెంతనే యున్ననేమి?
లేనిచో ప్రేమ సర్వమ్ము లేమి యౌను

రమ్ము వసియింపు నా యంతరంగమందు
విడచి పోబోకుమెపుడు నా యెడద వీడి
ఒక్కరును నన్ను ప్రేమించకున్న గాని
సతమునితరుల ప్రేమించు శక్తినిమ్ము



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS